క్లుప్తంగా

రంజాన్ కిట్‌ల పంపిణీ


రంజాన్ కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కంభం: ఎన్‌ఆర్‌ఐ సయ్యద్ రఫి, సయ్యద్ అన్వర్ ఆధ్వర్యంలో సోమవారం పేద ముస్లింలకు రంజాన్ తోఫా కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొమరోలు ఎంపీపీ అమూల్య, అర్థవీడు జెడ్పీటీసీ సభ్యురాలు చెన్నువిజయ ముఖ్య అతిథులుగా హాజరై రంజాన్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసంలో అందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్న సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపి నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం


విద్యార్థులకు భోజనం పెడుతున్న ప్రసాద్, హరికృష్ణ

మార్కాపురం: పట్టణంలోని స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీలోని 50 మంది దివ్యాంగ విద్యార్థులకు సోమవారం మొగుళ్లూరి నాగమణి వర్ధంతి సందర్భంగా అన్న వితరణ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త తాళ్లపల్లి ప్రసాద్ మాట్లాడుతూ.. దివ్యాంగుల చేయూతకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. పాఠశాలకు డైనింగ్ టేబుల్స్, కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో చిన్న శేషయ్య, న్యాయవాది హరికృష్ణ, మధుకుమార్, గొంట్ల కృష్ణ, అజీజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ


బస్ పాస్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు

దొనకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 33 మంది దివ్యాంగులకు ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. మండలంలో సమాచారం తెలియకుండా రాని వారు తోటి దివ్యాంగులతో మాట్లాడి మంగళవారం బస్ పాస్‌లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.సాంబశివరావు, ఈఓఆర్‌డీ ఎస్.డేవిడ్, దివ్యాంగుల అధ్యక్షుడు బచ్చలకూరి కాశయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రె పిల్లలపై కుక్కల మంద దాడి

- 12 గొర్రె పిల్లలు మృతి


గాయపడిన, మృతి చెందిన గొర్రె పిల్లలు

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు పంచాయతీ పరిధి చింతలపాలెంలో గొర్రె పిల్లలపై కుక్కల మంద దతాడి చేసింది. ఐదు కుక్కల దాడిలో దొడ్డిలో ఉన్న 16 గొర్రె పిల్లలు తీవ్రంగా గాయపడ్డాయి. అందులో 12 పిల్లలు చనిపోగా, నాలుగు పిల్లలు తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నాయి. దాడిలో చనిపోయిన గొర్రె పిల్లల విలువ దాదాపు రూ. 60వేల వరకు ఉంటుందని బాధితుడు పోటు శ్రీను వాపోయాడు.

కేంద్రం విధానాలపై సీపీఐ, సీపీఎం నిరసన

గిద్దలూరు రూరల్: ప్రజల సంపదను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు, అదాని సంస్థలకు ధారాదత్తం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న ప్రచార భేరీ కార్యక్రమంలో భాగంగా సోమవారం గిద్దలూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ వ్యవస్థను తగ్గిస్తానని చెప్పిన ప్రధాని అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆవులయ్య, దానం, శ్రీను, షంషీర్‌బేగ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

దానధర్మాలకు ప్రతీక రంజాన్

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: రంజాన్ మాసం దానధర్మాలకు ప్రతీక అని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైస్ చైర్మన్–2 అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు చెప్పల్లి కనకదుర్గ, యం శ్రీనివాసులు, కొత్త కృష్ణ, దొడ్డా భాగ్యలక్ష్మి, బుశెట్టి నాగేశ్వరరావు, మారంరెడ్డి లత, హర్షితబాబీ, కరీముల్లా, సలీం, బాను, రంగలక్ష్మమ్మ, ప్రసాద్, చంద్రశేఖర్, నగేష్, కరీమూన్, నాసర్‌వలీ, షేక్షావలి, జి.చెన్నారెడ్డి, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

ఈద్గాల అభివృద్ధికి సహకారం

మార్కాపురం: నియోజకవర్గంలో ఈద్గాల అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పెద్ద నాగులవరం రోడ్డులో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈద్గా ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంజాన్ పండగను ముస్లింలు సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కమిషనర్ గిరికుమార్, డీఈ సుభాని, ఏఈ ఆదినారాయణ, డాక్టర్ మగ్బూల్ బాషా, కౌన్సిలర్లు షేక్ మహమ్మద్, కరీంసా, రహ్మతుల్లా, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.


ఈద్గా ప్రహరీకి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేపీ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


పెదారికట్లలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న నాయకులు


సంక్షేమ పథకాలు వివరిస్తూ బుక్‌లెట్ అందిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, కోటిరెడ్డి

కొనకనమిట్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చినారికట్ల, పెదారికట్ల, గొట్లగట్టు, మునగపాడు, తువ్వపాడు, సిద్ధవరం గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి సర్పంచ్‌లు అనురాధ వెలుగొండయ్య, ఆర్ మరియమ్మ, సిద్దానబీ, ఉప సర్పంచ్ గాడి కోనేటిరెడ్డి, దివ్యాంగుల మండల కమిటీ అధ్యక్షుడు నుసుం బాలచంద్రుడు, గ్రామ పార్టీ అధ్యక్షులు కంది వెంకటరెడ్డి, వెంకటకొండయ్య, మద్దూరి కొండారెడ్డి, బత్తుల బాలపిచ్చయ్య, టి.నాగిరెడ్డి, ఎంపీటీసీ మీరావలి, ఉడుముల ధనలక్ష్మి బంగారురెడ్డి, ఉడుముల గురవారెడ్డి, సచివాలయ కన్వీనర్లు ఏ.కొండలు, ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

దొనకొండ: జగనన్న సంక్షేమం, అభివృద్ధి ప్రతి ఇంటికి దరి చేరిందని, అందుకే జగనన్నే మా నమ్మకం, మళ్లీ ఆయనే సీఎం కావాలని జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మిట్టా కోటిరెడ్డి అన్నారు. మండలంలోని రామాపురం, ఎస్సీ కాలనీ, బసిరెడ్డిపల్లి గ్రామాల్లో సోమవారం ఆయా సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో ఇంటింటికీ తిరిగి సంక్షేమం గురించి వివరించారు. వారి వెంట సర్పంచ్ గొంగటి మహేష్‌రెడ్డి, వైస్ సర్పంచ్ దేవయ్య, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

అర్ధవీడు (కంభం): అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యురాలు చెన్నువిజయ అన్నారు. ''మా నమ్మకం నువ్వే జగన్'' కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి గన్నేపల్లి గ్రామంలో, సోమవారం యాచవరం గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ప్రతిగడపకు వెళ్లి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరాతీసి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో కన్వీనర్ ఏరువ కృష్ణారెడ్డి, సర్పంచ్ పీరయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యర్రగొండపాలెంలో 144 సెక్షన్

యర్రగొండపాలెం: పట్టణంలో 144 సెక్షన్ అమలు చేస్తూ తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి ఆదేశాలు జారీ చేశారని ఎస్సై జి.కోటయ్య సోమవారం తెలిపారు. ఇశ్రాయిల్‌పేట ఆర్చి వివాదాన్ని దృష్టిలో పెట్టుకుని ఆదివారం అర్ధరాత్రి నుంచి 4 రోజుల పాటు ఈ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు గుంపులుగా సంచరించడం, సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం, మారణాయుధాలు కలిగి ఉండటం నిషేధమని తెలిపారు. 144 సెక్షన్‌కు వ్యతిరేకంగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పుల్లలచెరువు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 19వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎంపీపీ లాజర్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తప్పనిసరిగా రావాలని కోరారు.

20 ఎకరాల గడ్డివామి దగ్ధం

కుంకలమర్రు (కారంచేడు): మండలంలోని కుంకలమర్రులో సోమవారం జరిగిన ప్రమాదంలో సుమారు 20 ఎకరాల గడ్డి వామి ధగ్ధమైంది. స్థానికులు, బాధితుల కథనం మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో అదే ప్రాంతానికి చెందిన జొన్నలగడ్డ చిన అబ్రహంకు చెందిన సుమారు 20 ఎకరాల గడ్డి వామి నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చాయి. స్థానికులు గమనించి మంటలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు చాలా ప్రయత్నం చేశారు. అప్పటికే వేసవి ఎండల తీవ్రతతో ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండి మంటలు అదుపు చేయడం గ్రామస్తుల వల్ల కాలేదు. అప్పటికే గ్రామస్తుల సమాచారంతో అక్కడికి చేరుకున్న చీరాలకు చెందిన ఫైరింజన్ వచ్చి మంటలు అదుపు చేసింది. గడ్డి వామి పూర్తిగా కాలిపోయింది. దాని విలువ సుమారు రూ.లక్షకుపైగా ఉంటుందని బాధితుడు వాపోయాడు.

బైకును ఢీకొట్టిన కారు

అద్దంకి రూరల్: రోడ్డు దాటుతున్న బైకును కారు ఢీకొట్టడంతో బైకిస్టుకు గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం సాయంత్రం అద్దంకి పట్టణంలో జరిగింది. అందిన వివరాల ప్రకారం.. అద్దంకి పట్టణానికి చెందిన షేక్ అహ్మద్ ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. రంజాన్ మాసం కావడంతో స్థానిక భవానీ సెంటర్‌లోని మసీదుకు నమాజ్ చేసేందుకు వచ్చాడు. ముగించుకుని బయటకు వచ్చి వెళ్లే సమయంలో బైకు మీద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి ఒంగోలు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో అహ్మద్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ


మంటలు అదుపు చేయడంపై డెమో చూపిస్తున్న అధికారులు

దర్శి: ప్రమాదాలను అధిగమించేందుకు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖాధికారి సీహెజ్ జాలయ్య అన్నారు. స్థానిక కీజీజీ స్కూలులో అగ్ని ప్రమాదాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాలయ్య మాట్లాడుతూ మంటలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై ఆందోళన వద్దు

యర్రగొండపాలెం: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు ఆందోళన చెందకుండా నివారణ చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక కేంద్రం అధికారి బి.హరీష్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు ఎగసిపడుతున్న సమయంలో ఆందోళన చెందకుండా వెంటనే ఆర్పేందుకు ప్రయత్నించాలని సూచించారు. మంటలు ఎక్కువగా ఎగసిపడి గృహ సామగ్రికి అంటుకుంటే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని చెప్పారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు మంటలను ఆర్పే విధానంపై డెమో ద్వారా మహిళలకు అవగాహన కల్పించారు.

కోటపాడులో అగ్ని ప్రమాదం

- నాలుగు పూరిళ్లు, గడ్డివామి దగ్ధం

జే.పంగులూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కోటపాడులో సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. కోటపాడు దళిత కాలనీకి చెందిన గొల్లపూడి చిన్న పూరింటికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలంటుకున్నాయి. మంటలు స్థానికులు ఆపే ప్రయత్నం చేసేలోపే చుట్టుపక్కల ఉన్న 3 ఇళ్లకు క్షణాల్లో నిప్పు అంటుకుంది. నిప్పు అంటుకున్న నాలుగు ఇళ్ల కుటుంబ సభ్యులు కట్టు బట్టలతో బయట పడ్డారు. మేడు అంజయ్యకు చెందిన ఇంట్లో రెండు జతల బంగారం బుట్టలు, రూ.10 వేల డబ్బు, గృహోపకరణాలు కాలిపోయాయి. గొల్లపూడి రవికి చెందిన ఇంట్లో ఆరు గ్రాముల బంగారు జుమికీలు కాలిపోయాయి. గొల్లపూడి చిన్న అర సవర బంగారు ఉంగరం కాలి బూడిదైంది. గొల్లపూడి శిరోమణి, గొల్లపూడి శిలువరాజు గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. నాలుగు పూర్లిళ్లకు ఆనుకొని ఉన్న సామేలుకు చెందిన వరిగడ్డి వామి దగ్ధమైంది. దీని విలువ సుమారు రూ.30 వేలు ఉంటుంది. సుమారు రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. సమాచారం అందుకున్న అద్దంకి అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు.


కాలిపోయిన నాలుగు పూరిళ్లు

రాజుగారిపాలెంలో ఇరువర్గాల ఘర్షణ

మార్టూరు: పొలంలో గేదెలు పడ్డాయనే విషయమై మండలంలోని రాజుగారిపాలెంలో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. స్థానికులు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన విభూది అమరలింగం పొలంలో అదే గ్రామానికి చెందిన బత్తిన అంకమ్మ గేదెలు మేత కొరకు దిగడంతో అమరలింగం..అంకమ్మను ప్రశ్నించాడు. అందుకు అంకమ్మ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పుతూ చుట్టుప్రక్కల వారు వారిస్తున్నా వినకుండా వికలాంగుడైన అమరలింగంపై విచక్షణా రహితంగా దాడి చేయడంతో అతని చేతి వేలికి గాయమైంది. తనపై అంకమ్మ దాడి చేసిన విషయాన్ని బాధితుడు అమర లింగం సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరావుకు తెలుపగా సర్పంచ్ అంకమ్మను పిలిపించాడు. పొలం నుంచి గ్రామంలోకి వస్తున్న అంకమ్మను మార్గమధ్యంలో అమరలింగం తరఫు బంధువులు, మహిళలు చుట్టుముట్టి దాడి చేశారు. ఇరువర్గాలకు చెందిన సుమారు 150 మంది పరస్పర తోపులాటకు పాల్పడటంతో పోలీసులు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

టోల్ ప్లాజాను పరిశీలించిన ఎస్పీ

- అధికారుల కళ్లుగప్పి పారిపోయిన అగంతకులు
- గంజాయి అక్రమ రవాణా ముఠాకావచ్చని అనుమానం

మార్టూరు: స్థానిక జాతీయ రహదారిపై బొల్లాపల్లి టోల్ ప్లాజాను సోమవారం బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ ఫిరోజ్ బృందం కారు ఆపే ప్రయత్నాలు చేయగా అందులోని వ్యక్తులు ఆపకుండా వెళ్లిపోయారు. అధికారులు వారి వాహనాన్ని వెంబడించినా ఫలితం లేకపోయింది. ఇటీవల మార్టూరు, టోల్ ప్లాజా వద్ద తరుచూ గంజాయి రవాణా ముఠా సభ్యులు పట్టుపడుతున్న నేపథ్యంలో అధికారులను ధిక్కరించి వెళ్లిన కారు సైతం అలాంటిదే అని పోలీసు అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో విషయం తెలిసిన ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం బలికురువ వెళ్తూ టోల్ ప్లాజా వద్ద ఆగి జరిగిన సంఘటన గురించి ఆరా తీశారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ఫిరోజ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆదివారం ఘటనకు సంబంధించి కొందరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

క్రీడాకారుడు వేణుకు తెలంగాణ గవర్నర్ అభినందనలు


వేణును అభినందిస్తున్న తెలంగాణ గవర్నర్ తమిళసై

చీరాల టౌన్: పోర్చుగల్ దేశంలో జరిగిన వికలాంగుల వరల్డ్ గేమ్స్‌లో హైదరాబాద్‌కు చెందిన ఆదిత్య మెహతా ఫౌండేషన్ సహకారంతో చీరాల మండలం ఈపురుపాలేనికి చెందిన వినుకోటి వేణు డిస్కస్‌త్రోలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. దీంతో సోమవారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో తెలంగాణా గవర్నర్ తమిళసైను దివ్యాంగ క్రీడాకారుడు వేణు, ఫౌండేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. వికలాంగుల పోటీల్లో పతకం సాధించిన వేణును తెలంగాణ గవర్నర్ సత్కరించి అభినందించారు. దివ్యాంగులు కూడా అన్నీ రంగాల్లో రాణించాలని గవర్నర్ తమిళసై ఆకాంక్షించారు.

నేటి నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

అద్దంకి రూరల్: మే 10వ తేదీన జరగనున్న పాలీసెట్ పరీక్షలకు అద్దంకి పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపల్ ఏపీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతాయన్నారు. దరఖాస్తు చేయని వారు అదనపు రుసుం లేకుండా చెల్లించాల్సి ఉంటుదని తెలిపారు.

రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవాలి


సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీఏ రమాదేవి


వీఏఏలకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారులు

అర్ధవీడు (కంభం): రైతులు సాగు చేయబోయే పంటలకు ఏఏ ఎరువులు ఎంత మోతాదులో వేయాలో తెలుసుకోవాలంటే మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని మార్కాపురం ఏడీఏ రమాదేవి అన్నారు. మట్టి పరీక్ష శిక్షణ వారం కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతుభరోసా కేంద్రాల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మహమ్మద్, మార్కాపురం సాంకేతిక వ్యవసాయాధికారి చంద్రశేఖర్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వీఏఏలకు మట్టి నమూనాలపై శిక్షణ

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని మాదాలవారిపాలెంలో వ్యవసాయ సహాయకులకు మట్టి నమూనాల సేకరణ, పరీక్షలపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా దర్శి సబ్ డివిజన్ ఏడీఏ డి.నిర్మల మాట్లాడుతూ.. వేసవిలో పంటలు సాగు లేని సమయంలో మట్టి నమూనాలు సేకరించాలన్నారు. ఎరువులు, కంపోస్టు, ఇతర పోషక పదార్థాలు వేసిన నేలల్లో 45 రోజుల్లోగా మట్టి నమూనాలు సేకరించకూడదన్నారు. చెట్ల కింద, గట్టు వద్ద, కంచెల దగ్గర, కాలి బాటల్లో, సారవంతమైన, లేదా నిస్సారవంతమైన ప్రదేశాల్లో మట్టిని సేకరించవద్దని చెప్పారు. చౌడు భూముల్లో నమూనాలు విడివిడిగా సేకరించాలన్నారు. నీరు నిలిచి బురదగా ఉన్న నేల నుంచి కూడా మట్టి నమూనా సేకరించకూడదన్నారు. మట్టి సేకరించే ప్రాంతాలను ముందుగానే చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయాలని సూచించారు. ఏఓ షేక్.జైనులాబ్దిన్ మాట్లాడుతూ.. మట్టి నమూనాలు సేకరించిన తర్వాత క్వార్టరింగ్ పద్ధతి ద్వారా చివరికి అరకేజీ మట్టి వచ్చే వరకు తీసి పాలిథిన్ కవర్లో వేయాలన్నారు. ఎరువులకు ఉపయోగించే సంచులు, గోనె సంచుల్లో మట్టి వేయకూడదన్నారు. నమూనాతో పాటు రైతు పేరు, పొలం విస్తీర్ణం, సర్వే నెంబరు, గతంలో వేసిన పైరు, వేయబోయే పైరు వివరాలను నమోదు చేయాలని సూచించారు. మట్టి నమూనా పరీక్షల ఫలితాలు వచ్చిన తరువాత వ్యవసాయ సహాయకులు పరీక్షల ఫలితాలను విశ్లేషించి రైతులకు అవసరమైన సూచనలు చేయాలన్నారు. నేలలో ఏఏ పోషకాలు ఏస్థాయిలో ఉన్నాయి, ఏఏ పోషకాలు ఏ స్థాయిలో అవసరమో వివరించాలన్నారు. రైతులు మట్టి నమూనాలకు సహకరించి, సూచనలు పాటించాలని ఏఓ కోరారు.

మండలాలకు చేరిన పరీక్ష పేపర్లు

పుల్లలచెరువు: పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల నిర్వహణకు విద్యా శాఖ ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా మండల కేంద్రాలకు ప్రశ్నపత్రాలు చేరాయి. ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయి. ఎఫ్–2 పరీక్షలు నిర్వహిస్తారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో 5,600 మంది విద్యార్థులు ఈ ఏడాది ఓఎంఆర్ విధానంలో పరీక్షలు రాయనున్నారు. 1, 2 తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లిషు, 25న గణితం, మూడు నుంచి ఐదో తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లిషు, 25న గణితం, 26న పరిసరాల విజ్ఞానం పరీక్షలు జరుగుతాయి. 6 నుంచి 8 తరగతుల వారికి 20న తెలుగు, 24న హిందీ, 25న ఇంగ్లిషు, 26న గణితం, 27న జనరల్ సైన్స్, 28న సోషల్ స్టడీస్ పరీక్షలు జరుగుతాయని, ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఈవో శామ్యూల్‌జాన్ వివరించారు.


ఎంఈవో కార్యాలయానికి చేరిన ప్రశ్నపత్రాలు

పాఠశాలకు మంచి పేరు తేవాలి

తర్లుపాడు: విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు మంచి పేరు తేవాలని సర్పంచ్ కాశయ్య, ఎంపీటీసీ సభ్యులు పార్వతి రమేష్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని కారుమానుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక, క్విజ్ పోటీల్లో విజేతలకు హెచ్‌ఎం గోపాల్‌నాయక్, ఉపాధ్యాయుడు నబీ బహుమతులు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. పాఠశాల అభివృద్ధికి సహకరించిన పీఎంసీ చైర్మన్ ఫుల్లారెడ్డిని, వలంటీర్లు నందిని, సంధ్య, కుకింగ్ ఏజెన్సీ నిర్వహకురాలు నాగలక్ష్మమ్మ, ఆయా పిచ్చమ్మను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయ బృందం

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

తాళ్లూరు: గ్రామైఖ్య సంఘాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి మిగిలిన సభ్యులు కూడా సాగు చేసేలా కృషి చేయాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. ప్రకృతి వ్యవసాయంపై స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 2023–24 సంవత్సరంలో ప్రకృతి సాగుపై ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి నాగంబొట్లపాలెం, తూర్పుగంగవరం గ్రామాల్లో 8 యూనిట్లలో ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఏపీఎం దేవరాజ్ మాట్లాడుతూ పొదుపు సంఘాలు ప్రోత్సాహకాలను ఉపయోగించుకొని ఆరోగ్యాన్ని, ఆదాయాన్ని పొందాలన్నారు. ప్రకృతి సాగు ఇన్‌చార్జి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గంగమ్మతల్లికి ఆడపడుచుల పొంగళ్లు

కారంచేడు: గ్రామ దేవత జగజ్జననీ గంగాభవానీ అమ్మవారికి సోమవారం గ్రామ ఆడపడుచులు పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించారు. ఈ నెల 12వ తేదీ నుంచి అమ్మవారి ఆలయ 36వ శిళ్లు, నారునాళ్లు, శిడిమాను మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారి శిడి మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం నుంచి గ్రామ ఆడపడుచులు పెద్ద ఎత్తున అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. గ్రామ ఆడపడుచుల పొంగళ్లతో ఉత్సవాలను ముగించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

తప్పిన అగ్ని ప్రమాదం

పర్చూరు (చినగంజాం): ఓ టీ దుకాణంలో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగాయి. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం పర్చూరు బొమ్మల సెంటర్‌లో ఓ టీ దుకాణంలో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగాయి. టీ దుకాణదారుడు గృహ అవసరాల సిలిండర్ నుంచి వ్యాపార అవసరాల సిలిండర్‌కు గ్యాస్‌ను నింపుతుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి.